సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ
గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. 8లో



ఉధృతంగా గెడ్డలు, వాగులు
జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొండవాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. 8లో



గురుకుల విద్యార్థి అదృశ్యం
అరకు బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి కనిపించక పోవడంతో తల్లిదండ్రులు, బంధువులు సిబ్బందిని నిలదీశారు. 8లో

న్యూస్‌రీల్

మాజీ మావోయిస్టు దంపతులకు అభినందన



చెండా భూషణం దంపతులను అభినందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీ అనిల్

పాడేరు రూరల్ : ఇటీవల వివాహం చేసుకున్న మాజీ మావోయిస్ట్ నేత చెండా భూషణం, కుమారి దంపతులను ఎస్పీ తుహిన్ సిన్హా, అదనపు ఎస్పీ అనిల్ పులిపాటి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ హిమగిరి అభినందనలు తెలిపి ఆశీర్వాదించారు. ఈ మేరకు బుధవారం ఆయన పాడేరు ఎస్పీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రశాంతమైన జీవితం గడపాలని వారు ఆకాంక్షించారు.

పెదబయలులో 'జగనన్నకు చెబుదాం' రేపు

పెదబయలు: కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 15 తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య తెలిపారు.శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు, వ్యక్తిగత సమస్యలు, గ్రామాల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి మాజీ ఉప సర్పంచ్

- ఆహ్వానించిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



రాంబాబును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, తదితరులు

కొయ్యూరు: మండలంలోని పాత రావణాపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ జంపా రాంబాబు బుధవారం పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఆమె పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. రాంబాబు గతంలో టీడీపీ తరపున గ్రామ ఉప సర్పంచ్‌గా పనిచేశారు. పార్టీ క్రమశిక్షణ, ప్రజా సంక్షేమ పథకాలు అమలు తనను ఎంతగానో ఆకర్షించాయని ఆయన తెలిపారు.

25 వరకు పరీక్ష ఫీజుకు గడువు

చింతపల్లి: టెన్త్, ఇంటర్ దూరవిద్య పరీక్షలు రాసేందుకు ఈ నెల 25 వరకు ఎటువంటి అపరాధ రుసుం చెల్లించకుండా ఫీజు చెల్లించవచ్చని మండలంలోని పెదబరడ ప్రభుత్వ బాలుర పాఠశాల కోఆర్డినేటర్ కె.బాలన్న తెలిపారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలు రాసేందుకు ఆసక్తి గల విద్యార్థులు 9491606710, 8332936703, 9491902984 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

అంత్యక్రియలకు ఎన్ని కష్టాలో..

- గెడ్డ పొంగడంతో ఇబ్బందులు
- అతికష్టంమీద మృతదేహాన్ని శ్మశానానికి తరలించిన కుటుంబ సభ్యులు



బాలిక మృతదేహాన్ని గెడ్డ దాటిస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ తుమ్మిడిపుట్టు గ్రామ సమీపంలో గెడ్డ గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పొంగి ప్రవహిస్తోంది. బుధవారం గ్రామానికి చెందిన బాలిక బురిడి భాను(10) అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు అంత్యక్రియలు నిర్వహించేందుకు గెడ్డ అవతలి వైపు ఉన్న శ్మశానానికి తీసుకువెళ్లేందుకు కుటుంబ సభ్యులు అష్టకష్టాలు పడ్డారు. అతి కష్టం మీద మృతదేహాన్ని గెడ్డ దాటించి అంత్యక్రియలు నిర్వహించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుమ్మిడిపుట్టు గెడ్డపై వంతెన నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు కోరుతున్నారు.

గిరిలో 'పరివర్తన'

జిల్లాలో గంజాయి సాగు, రవాణా నివారణ లక్ష్యంగా పోలీసుల చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ఒకపక్క దాడులు నిర్వహిస్తూ మరోపక్క గంజాయి ప్రభావిత ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించేలా గిరిజనుల్లో పరివర్తన తెస్తున్నారు. ఇందుకు అవసరమైన సహకారం అందిస్తున్నారు. ఒడిశా ప్రాంతంలోని సాగును అరికట్టేందుకు అక్కడి పోలీసుల సమన్వయంతో ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. గంజాయి నివారణ ప్రత్యేక విభాగం సెల్ నంబర్‌ను ఆయన విడుదల చేశారు.

- జిల్లాలో పూర్తిగా తగ్గుముఖం పట్టిన గంజాయి సాగు
- సత్ఫలితాలిస్తున్న పోలీసుల చర్యలు
- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టిన సాగుదారులు
- అన్నిరకాలుగా సహకారం అందిస్తున్న ప్రభుత్వం
- ఒడిశా గంజాయికి అడ్డుకట్ట వేస్తాం: ఎస్పీ తుహిన్ సిన్హా



గంజాయి సాగును ధ్వంసం చేస్తున్న పోలీసులు (పాత చిత్రం)

గంజాయి సమాచారం తెలియజేయాల్సిన నంబరు: 9381123100

పాడేరు రూరల్ : జిల్లాలో గంజాయి సాగు, రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రత్యేక నిఘా వ్యవస్థ, ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి గంజాయి గంజాయి నిర్మూలనకు కృషి చేస్తున్నారు. గంజాయి సాగు ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారిలో చైతన్యం తీసుకువస్తున్నారు.గంజాయి సాగుకు దూరమైన గిరి రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేపట్టేందుకు పండ్లు, వాణిజ్య పంటల మొక్కలు, విత్తనాలను ఉచితంగా అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

క్షేత్రస్థాయి నుంచి..

గిరిజనుల్లో క్షేత్రస్థాయి నుంచి పరివర్తన వచ్చేలా పోలీసులు ప్రణాళికపరంగా చర్యలు చేపట్టారు. గంజాయి మత్తుకు నేటి యువత చిత్తు కాకుండా కళాశాలలు, పాఠశాలల్లో పరివర్తన కార్యక్రమాలు, కళాజాతలు ఏర్పాటు చేసి వారిని చైతన్య పరుస్తున్నారు.

- గంజాయి సాగుదారులపై కూడా ప్రత్యేకంగా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నారు. తరచూ గంజాయి కేసుల్లో పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తున్నారు. దీనివల్ల కూడా గంజాయి సాగు, రవాణా తగ్గుముఖం పట్టింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023)లో ఇప్పటివరకు గంజాయి సాగు, రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో 153 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో 12,397 కిలోల ఎండు గంజాయితో పాటు గంజాయితో తయారు చేసిన 9.5కిలోల అశిష్ ఆయిల్‌ను వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో 524 మందిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న 207 మందిని పట్టుకుని జైలుకి పంపించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 34 మందిపై నిఘా ఏర్పాటుచేసి అరెస్టు చేశారు.
- తరచూ అక్రమ గంజాయి రవాణాకు పాల్పడుతున్న 51 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మూడేళ్లలో 8,937 ఎకరాల్లో ధ్వంసం

గత మూడేళ్లలో జిల్లాలో అక్రమంగా సాగు చేస్తున్న 8,937 ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేశారు. ఇటీవల కాలంలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న జి.మాడుగుల మండలం గాదిగుంట, సుర్మతి పంచాయతీకి చెందిన ముగ్గురు, జీకే వీధి మండలం వై. కట్టు వీధి, వంచుల గ్రామాలకు చెందిన ఇద్దరు, పాడేరు మండలం కించూరు పంచాయతీ బొంగజంగి గ్రామానికి చెందిన ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వ సహకారంతో..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ సహకారంతో జిల్లాలో 7896 ఎకరాల్లో జీడి, సీతాఫలం, స్వీట్ ఆరెంజ్, యాసిడ్ లైమ్, జామ, కొబ్బరి, సపోటా, చింతపండు, మొరింగా, మమ్మిడి, అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మ, జామున్, జాఫ్రా, కాఫీ రాజ్మా, తదితర పండ్ల మొక్కలు, వాణిజ్య పంటల విత్తనాలను సరఫరా చేశారు. 10,62,061 సిల్వర్‌ఓక్ మొక్కలను కూడా అందజేశారు.

గంజాయి సాగు, రవాణాకు సహకరించొద్దు

ఎస్పీ తుహిన్ సిన్హా



మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా, పక్కన అదనపు ఎస్పీ(అడ్మిన్) అనిల్ పులిపాటి

జిల్లాలో గంజాయి సాగు, రవాణాకు ఏమాత్రం సహకరించవద్దని ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) అనిల్‌పులిపాటితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గంజాయి నివారణకు తీసుకున్న చర్యలను వివరించారు. గంజాయికి సంబంధించిన సమాచారాన్ని 9381123100 నంబరుకు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లాలో గంజాయి సాగు లేదన్నారు. ఒడిశాలో సాగు చేస్తున్న గంజాయిని మన ప్రాంతం మీదుగా తరలిస్తున్నారు. ఒడిశా పోలీసులతో సమన్వయం చేసుకొని పూర్తిస్థాయిలో గంజాయి సాగు, నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనుల భూముల్లో గంజాయి సాగు చేసిన సందర్భంలో ఆ సమాచారాన్ని గ్రామస్థాయి అధికారులు పోలీసులకు తెలియజేయాలన్నారు. అలా చేయని వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. అటువంటి సందర్భంలో కేసు నమోదైతే ఎన్డీపీఎస్ చట్టం 1985 సెక్షన్ 32 ప్రకారం ఆరు నెలల జైలు/జరిమానా, లేదా రెండు శిక్షలు కూడా ఒకేసారి విధించే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- 54 పోస్టుల భర్తీకి చర్యలు

సాక్షి, పాడేరు: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీకి చర్యలు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామి కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. పాడేరు డివిజన్‌లోని పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జి.కె వీధి, కొయ్యూరు మండలాలలో 12 ఖాళీలు, రంపచోడవరం డివిజన్‌లో రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం మండలాలలో 17 ఖాళీలు, చింతూరు డివిజన్‌లో చింతూరు, కూనవరం, ఎటపాక మండలాలలో 25 ఖాళీలు ఉన్నాయన్నారు. మొత్తం 54 అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హులనుంచి దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. అర్హత గల మహిళా అభ్యర్థులు 2023 సెప్టెంబర్ 14 నుంచి 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా సంబంధిత శిశు అభివృద్ధి పథకం అధికారికి నేరుగా గాని.. పోస్ట్ ద్వారా గాని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అంగన్వాడీ కార్యకర్త, ఆయా, మినీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేయదలచిన మహిళలు తప్పనిసరిగా పదోతరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ప్రధానంగా స్థానికంగా నివాసం కలిగిన వారై ఉండాలని సూచించారు. 2023 జూలై ఒకటి నాటికి 21 ఏళ్ల నుంచి 35 ఏళ్ల సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికలో పదవ తరగతి ఉత్తీర్ణతకు 50 మార్కులు, ప్రీ స్కూల్ టీచర్ ట్రెనింగ్, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు ఐదు మార్కులు, వితంతువులకు ఐదు మార్కులు, మైనర్ పిల్లలు కలిగి ఉన్న వితంతువులకు ఐదు మార్కులు ఉంటాయన్నారు. వీటితోపాటు పూర్తి అనాథ, క్రైచ్, హోమ్, ప్రభుత్వ సంస్థలలో నివసించి సత్ప్రవర్తన సర్టిఫికెట్ కలిగిన వారికి 10 మార్కులు, అర్హత కలిగిన వికలాంగ వ్యక్తులకు ఐదు మార్కులు మౌఖిక పరీక్షకు 20 మార్కులు మొత్తం 100 మార్కులకు లెక్కించబడుతుందని ఆయన పేర్కొన్నారు. ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

3,992 మందికి కొత్త పింఛన్లు

- ఇదే నెలలో మొదటి విడతలో 2800 మందికి మంజూరు
- అభాగ్యుల్లో ఆనందం
- పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



గుత్తులపుట్టులో కొత్త పింఛన్ అందుకున్న లబ్ధిదారులు

సాక్షి, పాడేరు: వైఎస్సార్ పింఛన్ కానుకతో అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేసింది. గ్రామాల్లో అర్హులను గుర్తించి వారికి సామాజిక పింఛన్లను మంజూరు చేయాలని, ఏ ఒక్కరు కూడా మిగిలిపోకూడదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాలోని 22మండలాల పరిధిలో ఈనెలలో మొదటి విడతగా 2800 మందికి సామాజిక పింఛన్లను ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ మేరకు పంపిణీ పూర్తయింది. ఈ నేపథ్యంలో రెండవ విడతలో జిల్లాకు 3992 కొత్త పింఛన్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం జిల్లా వ్యాప్తంగా రెండవ విడత కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు.

మండలాల వారీగా..

చింతపల్లి మండలంలో 329, వై.రామవరంలో 73, జి.కే.వీధిలో 227, కొయ్యూరులో 248, డుంబ్రిగుడలో 175, హుకుంపేటలో 210, ఎటపాకలో 296, పాడేరులో 226, అరకులోయలో 147, అనంతగిరిలో 242, పెదబయలులో 152, జి.మాడుగులలో 220, ముంచంగిపుట్టులో 173, చింతూరులో 239, అడ్డతీగలలో 121, వి.ఆర్.పురంలో 164, రంపచోడవరంలో 114, దేవీపట్నంలో 123, గంగవరంలో 90, రాజవొమ్మంగిలో 197, కూనవరంలో 164, మారేడుమిల్లిలో 52మందికి పింఛన్లు మంజూరయ్యాయి.

నిధుల విడుదల : జిల్లాలోని 3992 కొత్త పింఛన్ దారులకు రెండవ విడతలో ప్రభుత్వం రూ.కోటి 10 లక్షల 39 వేల 250ను విడుదల చేసింది. వీరిలో డప్పు కళాకారులు ఏడుగురికి రూ.21 వేలు, దివ్యాంగులు 238 మందికి రూ.7.14లక్షలు, వృద్ధులు 3074 మందికి రూ.84,53,500, ఒంటరి మహిళలు ఆరుగురికి రూ.16,500, వితంతువులు 659 మందికి రూ.18లక్షల 12వేల 250, మత్స్యకారులు నలుగురికి రూ.11 వేల పింఛను సొమ్ము విడుదలైంది.

ప్రభుత్వానికి రుణపడి ఉంటా



వృద్ధాప్య పింఛన్ కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. సిబ్బంది తన దరఖాస్తును ప్రభుత్వానికి పంపడంతో ఈనెల నుంచి పింఛన్ మంజూరు చేసింది. ప్రతి నెలా అందనున్న పింఛనుతో ఆర్థిక భరోసా ఏర్పడింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటా.

– ఒంద్రు లింగమ్మ, వృద్ధురాలు, సుండ్రుపుట్టు, పాడేరు మండలం

గాయపడిన ఆవుకు సత్వర వైద్యం

- స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఆయన ఆదేశాలతో చికిత్స అందించిన వైద్యాధికారి మాధవీలత



గాయపడిన ఆవుకు ఎటపాకలో చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి మాధవీలత

ఎటపాక: ఓ మూగజీవికి సకాలంలో చికిత్స అందేలా చర్యలు చేపట్టిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను పలువురు అభినందించారు. సరిహద్దున ఉన్న తెలంగాణ రాష్ట్రం భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో ఇటీవల నిండు చూడుతో ఉన్న ఆవును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఆవుకు వెనుక తుంటి భాగంలో గాయం కావటంతో అక్కడే రహదారి పక్కన పడిఉంది. దీనిని గమనించిన జంతుప్రేమికుడు ఉదయకుమార్ ఆవును పట్టణంలోని పశువైద్యశాలకు తరలించారు.అక్కడ వైద్యులు అందుబాటులో లేరు. 1962 సిబ్బందితో సపర్యలు చేయడంతో ఆవు ప్రసవించింది.

అయితే గాయపడిన ఆవుకు చికిత్స చేసేందుకు ఆస్పత్రిలో ఎవరూ లేకపోవటం అక్కడ ఉంచేందుకు కూడా స్థలం లేక దానిని సరిహద్దునే ఉన్న ఆంధ్రా పరిధిలోని కొండిశెట్టి బుజ్జి స్థలంలో ఉంచారు. గత మూడు రోజులుగా గాయంతో ఉన్న ఆవు వేదన, దూడకు పాలులేక చేస్తున్న ఆర్తనాదాలు అక్కడ ఉన్నవారిని చలింపచేశాయి. ఆవుకు చికిత్స చేయకపోతే ప్రాణాలు పోతాయని గ్రహించిన ఉదయకుమార్ రాజమండ్రిలో ఉన్న సహచర మిత్రుడైన లాయర్ గోపికాంత్‌శర్మకు పరిస్థితిని వివరించారు.

దీంతో ఆయన వెంటనే కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫోన్ చేశారు. ఆవుకు వైద్యం అందించేలా చూడాలని కోరారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పశుసంవర్థక శాఖ అధికారులకు విషయం తెలియజేసి వైద్యం అందించాలని ఆదేశించారు. మంగళవారం రాత్రి స్థానిక పశువైద్యాధికారి మాధవీలతకు సమాచారం రావటంతో బుధవారం ఉదయం ఆవుకు చికిత్స ప్రారంభించారు. ప్రస్తుతం కోలుకుంటోంది.

మధుర ఫలానికి భలే డిమాండ్

కాశీపట్నం మార్కెట్లో బుధవారం జరిగిన వారపు సంతలో సీతాఫలం రైతుకు ఊహించని ధర లభించింది. దీంతో వారిలో ఆనందం నెలకొంది. కేట్ ధర రూ.700 నుంచి రూ.1200కు పెరిగిపోయింది. భారీ ఎత్తున వ్యాపారం జరిగింది.

- కాశీపట్నం మార్కెట్లో భారీగా ధరలు
- సీతాఫలాలను భారీగా తీసుకువచ్చిన గిరిజనులు
- కేట్ ధర రూ.700 నుంచి రూ.1200కు పెరుగుదల
- ఊహించని ఆదాయం పొందిన గిరిజనులు



కాశీపట్నం వారపు సంతలో సీతాఫలాలు

అనంతగిరి: మండలంలో సీతాఫలం సాగు చేపట్టిన గిరి రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. బుధవారం కాశీపట్నంలో జరిగిన వారపు సంతలో రెట్టింపు ధర లభించడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వర్షాలు కురుస్తుండటంతో దిగుబడి భారీగా పెరిగింది. దీంతో ఆదే స్థాయిలో సీతాఫలాలను గిరిజనులు వారపు సంతకు తీసుకువచ్చారు. సంత ప్రాంగణమంతా ఫలాలతో నిండిపోయింది. దీంతో గిట్టుబాటు ధర వస్తుందా రాదా అనే మీమాంసలో ఉన్న గిరి రైతులకు మార్కెట్ పరిస్థితులు కలిసొచ్చాయి. దూర ప్రాంతాల నుంచి భారీగా వ్యాపారులు తరలి వచ్చారు. బుధవారం జరిగిన వారపు సంతలో రికార్డు స్థాయిలో సుమారు 800 కేట్ల సీతాఫలాలను వారు పోటాపోటీగా కొనుగోలు చేశారు.

రుచి వల్లే డిమాండ్..

అనంతగిరి ప్రాంతంలో పండించే సీతాఫలాలు రుచికరంగా ఉన్నందున మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వీటిని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేసేందుకు అధిక ప్రాధాన్యమిస్తుంటారు. ఈ ఏడాది జూలై మొదటివారం నుంచి సీతాఫలం సీజన్ ప్రారంభమైంది.

ఊహించని ధరతో..

గత ఏడాది కాశీపట్నం వారపు సంతలో సీతాఫలం కేట్ ధర రూ.700 పలకగా ఈ ఏడాది అంతకుమంచి రూ.1200 ధర లభించింది. కావిడి సీతాఫలాలను వ్యాపారులు రూ.2 వేలకు కొనుగోలు చేశారు. మండలంలోని ఎన్ఆర్‌పురం పంచాయతీ పరిధిలోని పెదకోనేల, డెంజంగివలస, బూడు మామిడివలస, బూడ్డెవలస, పెద్దూరు, డి.కోటపర్తి, గొడుగుమామిడివలస సీతాఫలాన్ని సాగు చేస్తున్నారు. వీరంతా కాశీపట్నం మార్కెట్‌పైనే ఆధారపడుతుంటారు. అనంతగిరి మండలంలో 12 ఎకరాలు, అరకులోయ మండలంలో 3 ఎకరాలు, డుంబ్రిగుడ మండలంలో 16 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో సీతాఫలానికి డిమాండ్ ఉన్నందున వెంటనే అమ్ముకోగలిగామని ఎన్ఆర్ పురానికి చెందిన సీతమ్మ అనే గిరి మహిళ తెలిపింది. ఊహించిన దాని కన్నా మంచి ధర లభించిందని ఆమె ఆనంద వ్యక్తం చేసింది.

స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు 14న సర్టిఫికెట్ల పరిశీలన

పాడేరు రూరల్ : ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) పోస్టులకు పదోన్నతులు అర్హత కలిగిన ఎస్జీటీలకు అవకాశం కల్పిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ.కొండలరావు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు ఈనెల 14న పాడేరు గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తామన్నారు. అర్హత కలిగిన సెకెండరీ గ్రేడ్ టీచర్స్ ఫిజికల్ సబెక్టులో ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మరమ్మతులకు నోచుకోని 'డుడుమ' గేట్లు



మరమ్మతుకు గురైన డుడుమ డ్యామ్ గేటు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్‌కు నీరందించే డుడుమ డ్యామ్ గేట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీనివల్ల నీరు వృథా అవుతోంది. ఈ ప్రాజెక్టు డ్యామ్‌కు 8 పవర్ గేట్లు ఉన్నాయి. వీటిలో దాదాపుగా అన్నింటికి లీకేజులు ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో గేట్లు ఎత్తినప్పుడు సాంకేతిక లోపాలు తలెత్తున్నాయి. లీకేజీల వల్ల నీరు దిగువకు వెళ్లిపోతోంది. డ్యాం గేట్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉందని డుడుమ ప్రాజెక్ట్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా
కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం
వంజంగి హిల్స్ రోడ్డు, పాడేరు
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు :
94915 53782, 70757 09205

క్లుప్తంగా

ఐటీడీఏ పీవోకు ఎమ్మెల్యే వినతి



ఐటీడీఏ పీవో అభిషేక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: గిరిజ న ప్రాంతాల్లో వర్షా లు కురుస్తుండడంతో తాగునీటి వనరులు కలుషితమై, సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితులతో వైద్య బృందాలను అప్రమత్తం చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌ను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. బుధవారం సాయంత్రం పీవోను అరకు ఎమ్మెల్యే కలిశారు. అరకు నియోజకవర్గంలోని పెండింగ్‌లో రోడ్లు, ఇతర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ తాగునీటి వనరుల క్లోరినేషన్ ప్రక్రియతో పాటు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీవోను కోరామన్నారు.

నేడు సీపీగా రవిశంకర్ అయ్యనార్ బాధ్యతలు



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: విశాఖ పోలీస్ కమిషనర్‌గా డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు సీపీగా విధులు నిర్వర్తించిన డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) ఐజీగా ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన, ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషినల్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న రవిశంకర్‌ను విశాఖ సీపీగా నియమించింది. అడిషినల్ డైరెక్టర్ జనరల్ హోదా అధికారిని విశాఖ పోలీస్ కమిషనర్‌గా నియమించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. విశాఖ పరిపాలన రాజధాని కానున్న నేపథ్యంలో ఏడీజీ స్థాయి అధికారిని నియమించినట్లు తెలుస్తోంది. అలాగే నూతన డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా కంచి శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

ఉధృతంగా గెడ్డలు, వాగులు



కుమ్మరివీధిలో వర్షానికి నేలమట్టమైన ఇంటి గోడలు



గుల్లేలు వెళ్లే మార్గంలో వంతెనపై నుంచి పొంగి ప్రవహిస్తున్న గెడ్డ నీరు



మద్దిగరువు మార్గంలో బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న గెడ్డ నీరు

- జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు
- 697.6 ఎంఎం వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముంచంగిపుట్టు,పెదబయలు మండలాల్లో కొండవాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జి.మాడుగుల,పెదబయలు,ముంచంగిపుట్టు,డుంబ్రిగుడ,చింతపల్లి మండలాల్లోని ప్రధాన గెడ్డలు ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో మారుమూల గ్రామాలకు రవాణా సంబంధాలు నిలిచిపోయాయి. అన్ని మండలాల రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ అప్రమత్తం చేశారు.జిల్లా వ్యాప్తంగా బుధవారం 697.6 ఎంఎం వర్షపాతం నమోదైంది.అత్యధికంగా ముంచంగిపుట్టు మండలంలో 121.5, అత్యల్పంగా దేవీపట్నంలో 0.1 ఎంఎం వర్షపాతం నమోదైందని అధికారవర్గాలు తెలిపాయి. పెదబయలులో 99.6, పాడేరులో 61.9, చింతూరులో 56.6, హుకుంపేటలో 55.8, డుంబ్రిగుడలో 48.7, చింతపల్లిలో48.1, జి.కే.వీధిలో 39.2, జి.మాడుగులలో 38.1, మారేడుమిల్లిలో 25.3, వై.రామవరంలో 24.1, అరకులోయలో 22.6, రాజవొమ్మంగిలో15.6, కొయ్యూరులో 12.8, వి.ఆర్.పురంలో 8.6, అనంతగిరిలో 4.7, కూనవరంలో 4.2, రంపచోడవరంలో 3.7, గంగవరంలో 2.7, అడ్డతీగలలో 2.6, ఎటపాకలో1.1 ఎంఎం వర్షపాతం నమోదైందని పేర్కొన్నాయి.

నీట మునిగిన వరి పొలాలు

పెదబయలు: మండలంలో బుధవారం 134.6 ఎంఎం వర్షం పాతం నమోదయ్యింది.గిన్నెలకోట, ఇంజరి, జామిగుడ, గుల్లేలు పంచాయతీలకు వెళ్లే గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు గోమంగి పంచాయతీ కుమ్మరివీధి గ్రామానికి చెందిన కుంబిడి ఎస్తేరు ఇంటి గోడ కూలిపోయింది.పురుగుడిపుట్టు, గలగండ, గోమంగి పంచాయతీ రాయిమామిడి, గల్లేలపుట్టు, కుమ్మరివీధి, సరియాపల్లి, గోమంగి డెండ్రాయిపుట్టు, మర్రిపుట్టు, రంగలోయ గ్రామాల్లో వరి పొలాలు నీటమునిగాయి. గిరిజనులు గెడ్డలు దాటేందుకు ప్రయత్నించవద్దని, వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తహసీల్దార్ కృష్ణారావు సూచించారు.



రంగలోయ గ్రామ సమీపంలో వరి పొలాల్లో వరద నీరు

వంతెనపైనుంచి గెడ్డ ప్రవాహం

హుకుంపేట: మండలంలోని చీడిపుట్టు,సంతారి గెడ్డలతో పాటు మత్స్యగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. చీడిపుట్టు వంతెనపై నుంచి గెడ్డ ప్రవహించడంతో అడ్డుమండ ప్రాంతం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఒడిశా సరిహద్దు కామయ్యపేట, రాతులపుట్టు, గరుడాపల్లి ప్రాంతాల్లో గిరిజనులు చేపల వేటలో నిమగ్నమయ్యారు.

ఉధృతంగా చాపరాయి గెడ్డ

డుంబ్రిగుడ: లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చాపరాయి గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. గ్రామాల్లో డ్రైనేజీల్లోని పూడిక తీయించకపోవడం వల్ల రోడ్లపైకి వర్షం నీరు వచ్చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గసభ పంచాయతీ కేంద్రంలో పాంగి డొంబు అనే గిరిజనుడి ఇల్లు పూర్తిగా దెబ్బతింది. తిండి గింజలు తడిచిపోవడంతో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. పంట పొలాలు నీటమునిగాయి. కొర్రా, చెలిమర వలస గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పాడింది. కించుమండలో వారపు సంత జరగలేదు.

జి.మాడుగుల: మద్దిగరువు రోడ్డు మార్గంలో చాప గెడ్డ పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పశువులతో మేత నిమిత్తం వచ్చిన ఆరుగురు గిరిజనులు గెడ్డను దాటి స్వగ్రామానికి వెళ్లే మార్గం లేకుండా పోయింది.



గసభలో కూలిన ఇల్లు



ఉధృతంగా ప్రవహిస్తున్న సంపంగి గెడ్డ



పురుగుడిపుట్టులో నీట మునిగిన వరి పొలాలు

ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పెదవలసలో గ్రామ సచివాలయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

గూడెం కొత్తవీధి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారంమైందన్నారు. మండలంలోని పెదవలసలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని , రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను శ్రీకారం చుట్టారన్నారు. గతంలో సమస్యల పరిష్కారానికి మండల కేంద్రాలకు లేదా జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఈ కారణంగా గిరిజనులు చాల రకంగా ఇబ్బంది పడేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు కూడా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని, ఇందుకు రైతుల చేంతకే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు కోసం సబ్సిడీపై విత్తనాలు, యంత్రాలు, ఎరువులు, రైతులు సాగు చేస్తున్న పంటలపై వ్యవసాయ అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. శివారు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు.

ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ శివరత్నం, జిల్లా ఎస్టీ సెల్ సభ్యుడు బొబ్బిలి లక్ష్మణ్, కో–ఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్ వనుపరి ప్రసాద్, జిల్లా కో–కన్వీనర్ గిరిప్రసాద్, సర్పంచ్‌లు వంశీకృష్ణ, రామకృష్ణ, లక్ష్మి, నాగేంద్రకుమార్, నాగులమ్మ, ఎంపీటీసీలు కృష్ణ మూర్తి ,నాగమణి, సత్యనారాయణ, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పీఆర్ జేఈ జ్యోతి బాబు, కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

తప్పిబోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ఎటపాక: ఇంటి నుంచి తప్పిపోయి రహదారిపై ఒంటరిగా తిరుగుతున్న బాలికను పోలీసులు గుర్తించారు. తెలంగాణ రాష్ట్రం దుమ్ముగూడెం మండలం బైరాగులపాడు సమీపంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన కుంజా వెంకటేష్, మమత దంపతుల కుమార్తె జోస్మితను భద్రాచలంలోని వారి బంధువుల ఇంట్లో ఉంచి చదివిస్తున్నారు. అయితే బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చి తప్పిపోయి చెన్నంపేట సమీపంలో ఒంటరిగా రహదారిని దాటుతున్న బాలికను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ పార్థసారథి తన సిబ్బందితో వెళ్లి బాలికను స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆమెకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు స్థానిక పోలీసుస్టేషన్ వచ్చారు. వారి నుంచి పూర్తి వివరాలు సేకరించి నిర్ధారించిన తరువాత బాలికను వారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

కలెక్టర్ దృష్టికి మండల సమస్యలు

చింపల్లిరూరల్: మండలంలోని పలు సమస్యలను మంగళవారం కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలసి కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం ముఖ్యంగా చింతపల్లి ఆస్పత్రిలో సమస్యలు, కిటుముల పంచాయతీలో ఎంపీపీ పాఠశాలలో మరమ్మతులు, మండలంలో రోడ్లు, చెక్‌డ్యాంల నిర్మాణాలు, మరమ్మతుల విషయంతో పాటు ఇటీవల అకాల వర్షాలతో కోటగున్నలలో పేద మహిళకు చెందిన కూలిన ఇల్లు విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. దీనిపై ఆయన సానుకులంగా స్పందించి అన్ని సమస్యలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. గూడెం కొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి, నాయకులు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

గురుకుల విద్యార్థి అదృశ్యం

సిబ్బందిని నిలదీసిన తల్లిదండ్రులు, బంధువులు

అరకులోయ రూరల్: స్థానిక బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి శనివారం కనిపించడం లేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయతీ దూదు గూడ గ్రామానికి చెందిన విద్యార్థి వంతాల చిన్నారావు ఈ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. గత శనివారం నుంచి కనిపించడంల లేదన్న సమాచారం తెలుసుకున్న అతని తల్లిదండ్రులు బంధువులతో కలిసి బుధవారం పాఠశాలకు వచ్చారు. సిబ్బందిని నిలదీశఋూరు. సుమారు వారం రోజులు కావస్తున్నా ఎందుకు సమాచారం ఇవ్వలేదని విద్యార్థి తల్లిదండ్రులు శోభన్న, కాంతమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ధ్వజమెత్తారు. పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశామని సిబ్బంది పేర్కొన్నారు. తమ కుమారుడిని అప్పగించకుంటే ఆందోళనకు దిగుతామని విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు సిబ్బందిని హెచ్చరించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు

చింతపల్లిరూరల్: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డి.డి కొండలరావు అన్నారు. మండలంలో బలపం ఆశ్రమ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని వంటగదిలో సరకులను పరిశీలించారు. మెనూ అమలుచేయాలని ఆదేశించారు. ఏటీడబ్లూవో జయనాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆటో డ్రైవింగ్ శిక్షణ



శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులు

కొయ్యూరు: డౌనూరులో మహిళలు, పురుషులకు సిఫా కన్సర్న్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఆటోడ్రైవింగ్‌పై శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఎ.గోపాలరావు మాట్లాడుతూ ఆటోడ్రైవింగ్‌లో శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. రవాణా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేశారు. కన్సర్న్ ఛారిటబుల్ ట్రస్ట్ ఎండీ పీకే జోస్ మాట్లాడుతూ మహిళలు కూడా ఆటో రంగంలో శిక్షణ పొందడం ఆనందంగా ఉందన్నారు. కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ పాల్గొన్నారు

200 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్టు, ముగ్గురు పరారీ



గంజాయి నిందితులతో పోలీసులు

మోతుగూడెం: కారులో తరలిస్తున్న రూ.6 లక్షల విలువైన 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్టు డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తెలిపారు. బుధవారం డొంకరాయి పోలీసుస్టేషన్ ఎదుట వాహన తనిఖీలు చేపట్టారు. కారులో 200 కిలోల గంజాయిని తరలిస్తూ నలుగురు వ్యక్తులు పట్టుబడగా ముగ్గురు పరారయ్యారని ఆయన వివరించారు. పట్టుబడిన వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. నిందితుల్లో ఇద్దరు మహారాష్ట్ర, ఒకరు తెలంగాణ, మరొకరు రాష్ట్రానికి చెందిన వారు ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

నేడు ఏయూలో జాబ్‌మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. డెక్కన్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ట్రైనీ కెమిస్ట్ విభాగంలో 250, జూనియర్ కెమిస్ట్ విభాగంలో 100 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రైనీ కెమిస్ట్‌కు 27 సంవత్సరాలలోపు వయసు గలవారు అర్హులని, నెలకు వేతనం రూ.19,744 ఉంటుందని తెలిపారు. జూనియర్ కెమిస్ట్‌కు 30 ఏళ్ల లోపు వయసు గలవారు దరఖాస్తు చేసుకోవాలని, వార్షిక వేతనం ఏడాదికి రూ 3.5 లక్షలు అందిస్తారని తెలియజేశారు. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్‌లో అసోసియేట్ ఆపరేషన్స్ ఉద్యోగానికి టైప్ రైటింగ్‌లో నిమిషానికి 28 పదాలు టైప్ చేయగలిగి, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. మొత్తం 258 ఖాళీలు భర్తీ చేస్తామని, 20 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు అర్హులని, వీరికి నెలకు వేతనంగా రూ.15 వేలు అందిస్తారని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను ncs. gov. in లో నమోదు చేసుకోవాలని, ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 96660 92491 నంబరులో సంప్రదించాలని వివరించారు.

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. కల్యాణ్ జ్యువెలర్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో 50 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. నెలకు జీతం రూ.16,400 ఉంటుంది. అభ్యర్థులు https://www.ncs.gov.in/లో పేర్లు నమోదు చేసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వుడ్ పోలీస్ మైదానంలో ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొసాగుతున్నాయి. బుధవారం జరిగే పరీక్షలకు 800 మందికి హాల్ టికెట్లు పంపగా.. 668 మంది అభ్యర్థులు హాజరయ్యారు. విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షణలో అధికారులు వీరికి పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు

నర్సీపట్నం: ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కామర్స్, ఎకనామిక్స్, లైబ్రేరియన్ సబ్జెక్టులు బోధించే గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్.రాజు తెలిపారు. ఎకనామిక్స్–1, లైబ్రేరియన్–1, కామర్స్–3 పోస్టులు ఉన్నాయన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందించాలన్నారు. ఇంటర్వ్యూలు 20వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు.

పీజీలో ప్రవేశాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులలో మిగిలి ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంకామ్‌లో 40, ఎమ్మెస్సీలో 20 సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా 20వ తేదీలోగా రిజిస్ట్రేషన్, 22 లోగా సర్టిఫికేట్ల వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 20 నుంచి 24వ తేదీలోగా వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలన్నారు.

ఉన్నతితో ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లి: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు స్థానిక మండల పరిషత్ కార్యలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఎన్ఆర్జీజీయస్ పథకంలో 2018 నుంచి 2023 వరకు 100 రోజుల పనులు పూర్తి చేసిన కార్మికదారుల కుటుంబాలకు చెందిన యువతీ, యువకులకు ఉన్నతి కార్యక్రమం ద్వారా వివిధ నైపుణ్య రంగంలో ఉచిత శిక్షణ కల్పించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. చింతపల్లి , గూడెంకొత్తవీధి మండలాల నుంచి మొత్తం 400 మంది ఎంపికైన అభ్యర్థులను విశాఖపట్నం, పెందుర్తి, గోపాలపట్నం, షీలానగర్, అనకాపల్లి శిక్షణ కేంద్రాల్లో మూడునెలల పాటు వసతి, భోజనం కల్పించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆమె తెలిపారు.శిక్షణ కాలంలో 75 శాతం హాజరు పూర్తి చేసుకున్నవారికి ప్రభుత్వం గౌరవ వేతనం అందచేస్తోందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20 లోగా పేర్లను దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అల్లూరి జిల్లా జాబ్స్ మెనేజర్ కళ్యాణి జగదీశ్వరి, ఎన్ఆర్ఈజీయస్ ఏపీవోలు కోండబాబు, ఈశ్వరరావు, రాం ప్రసాద్, కో–ఆర్డినేటర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సీటీ స్కాన్..డయాలసిస్ యూనిట్

- వైద్యాలయంలో త్వరలో ఏర్పాటు
- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి వెల్లడి



రోగులతో మాట్లాడుతున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ వైద్యాలయంలో కిడ్నీ రోగుల కోసం ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న డయాలసిస్ యూనిట్‌ను త్వరలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి చెప్పారు. బుధవారం వైద్యాలయంలో వివిధ విభాగాలను ఆయన పరిశీలించి అక్కడ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వైద్యాలయంలో సీటీ స్కాన్ మిషన్ కోసం అదానీ గ్రూప్ యాజమాన్యంతో చర్చించారని, వారి సీఎస్సార్ నిధుల నుంచి రూ.2 కోట్లతో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన మిషన్ త్వరలో ఏర్పాటు చేస్తారని తెలిపారు. రూ.22 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ కూడా త్వరలో ప్రారంభమవుతుందని, ఈ యూనిట్ వలన అన్ని ప్రమాదకరమైన, అత్యవసర కేసులన్నింటికీ ఇక్కడే వైద్యం అందించే అవకాశం కలుగుతుందన్నారు. డీసీహెచ్ శ్రీనివాసరావు, ఆర్ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎం.శ్రీనివాసరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

విమ్స్‌లో ఎనస్థీషియా టెక్నీషియన్ పోస్టుల భర్తీలో అక్రమాలు

విచారణకు ఆదేశించిన వైద్య ఆరోగ్య శాఖ

మహారాణిపేట: విమ్స్‌లో భర్తీ చేసిన ఎనస్థీషియా టెక్నీషియన్ పోస్టుల వ్యవహారంపై వైద్య ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. వైద్య ఆరోగ్య శాఖ, విమ్స్ సంయుక్తంగా గతేడాది 13 ఎనస్థీషియా టెక్నీషియన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి, అభ్యర్థులను ఎంపికచేశాయి. ప్రస్తుతం వీరు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అయితే ఏడు పోస్టులను అనర్హులకు కట్టబెట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎనస్థీషియా టెక్నీషియన్ పోస్టులకు భారత సేవ సమితి ఇచ్చిన డిప్లమో పనికిరాదని చెప్పిన అధికారులు.. ఇదే సర్టిఫికెట్ కలిగి ఉన్న కొందరిని మాత్రం ఎంపిక చేశారని సమాచారం. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూప్ తీసుకున్న అభ్యర్థులను ఎంపిక చేశారన్న విమర్శలు వచ్చాయి. అలాగే రూల్ ఆఫ్ రిజర్వేషన్ నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. మెరిట్, ఎంపిక జాబితాల్లో లేని అభ్యర్థులకు పోస్టులు ఇచ్చారని తెలిసింది. దీనిపై 'సాక్షి'పలు కథనాలు ప్రచురించింది. తాజాగా కొంత అర్హులైన అభ్యర్థులు తమకు అన్యాయం జరిగిందంటూ రాష్ట్ర వైద్య విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నరసింహంకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఎంఈ కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసకుమార్‌ను విచారణ అధికారిగా నియమించి.. ఈ నెల 15లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆయన విమ్స్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయాల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.